క్లుప్తంగా

నేడు పాఠశాలలకు సెలవు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థుల తల్లి దండ్రులు, స్కూల్స్ పేరెంట్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు శనివారం జిల్లాలో పాఠశాలలకు ఒక రోజు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సోమవారం వినాయక చవితి పండగ నేపథ్యంలో శనివారం స్కూళ్లకు సెలవు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఇంటి ముంగిటకే పథకాలు



జి.దొంతమూరులో పింఛన్ లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు, నాయకులు

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏర్పాటైన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హుల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని సర్పంచ్ గోలి రమణ అన్నారు. జి.దొంతమూరు సచివాలయం వద్ద గ్రామంలో కొత్తగా మంజూరైన 28 మందికి పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన వచ్చేదని, జగనన్న ప్రభుత్వంలో కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు గోలి వెంకటకృష్ణ, వైఎస్సార్ సీపీ కన్వీనర్ చెక్కపిల్లి నాగేశ్వరరావు, ముత్యం వీరబాబు, కార్యదర్శి గౌరీశాంతి తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగంలో అపార అవకాశాలు



సదస్సులో మాట్లాడుతున్న అభయ్ ఏగూరు

రాజానగరం: ఆసక్తి, ఉత్సాహం ఉన్న యువతకు అంతరిక్ష రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని ధ్రువ కోఫౌండర్, సీటీఓ అభయ్ ఏగూరు అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మేధ సాంకేతిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కళాశాల ఎండీ కె.శశికిరణ్‌వర్మ అధ్యక్షతన జరిగిన జరిగిన ఈ కార్యక్రమంలో అభయ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేర్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్స్‌కి కూడా శాటిలైట్ రూపకల్పనలో ఎన్నో అవకాశాలున్నాయన్నారు. ఈ సందర్భంగా తమ సంస్థ రూపొందించిన నానో మినీయేచర్ శాటిలైట్‌ను విద్యార్థులకు చూపించి, దాని ప్రత్యేకతను వివరించారు. తొలుత కళాశాల ప్రాంగణంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్లు డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డాక్టర్ ఎంఎస్ బాబు, డాక్టర్ పీజీ రామానుజం, డాక్టర్ ఎండీ ధనరాజ్, డైరెక్టర్ డాక్టర్ టీవీ ప్రసాద్, సదస్సు కన్వీనర్ వి.సుబ్రహ్మణ్యం, కోకన్వీనర్ డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

బిక్కవోలు: ఊలపల్లిలో దోమల నివారణ చర్యలు ప్రారంభించారు. శుక్రవారం గ్రామంలోని మురుగు కాలువ వద్ద బ్లీచింగ్, ఫినాయిల్, సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు ముమ్మరం చేసినట్లు ఎంపీటీసీ బండారు శివ తెలిపారు.

కనకదుర్గమ్మకు పూజలు

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలోని జి.మామిడాడ రోడ్డు వద్ద కొలువైన కనకదుర్గమ్మ వారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.

నిబంధనలు తప్పకుండా పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై చిరంజీవి

సీతానగరం: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాలు, పందిళ్ల విషయంలో కమిటీలు తప్పనిసరిగా నియమ, నిబంధనలు పాటించాలని ఎస్సై కె.చిరంజీవి స్పష్టం చేశారు. సీతానగరం పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం మండలంలోని ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ పబ్లిక్ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయరాదని, విగ్రహాలు పెట్టే స్థలం యజమాని నుంచి అనుమతి పత్రం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మైక్ ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు. ఊరేగింపు రూట్ ముందుగా తమకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రోడ్డు సమస్యకు సత్వర పరిష్కారం

- రోడ్డు అధ్వానంగా ఉందంటూ ఎమ్మెల్యేకు ఫోన్‌లో తెలిపిన మహిళలు
- స్పందించిన జక్కంపూడి రాజా
- సొంత నిధులతో అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళలు



రాజంపేటలో ఎమ్మెల్యే రాజా వేయించిన గ్రావెల్ రోడ్డు

సీతానగరం: ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తక్షణమే స్పందిస్తున్నారు. వెంటనే పరిష్కారాన్ని కూడా చూపుతున్నారు. దానికి నిదర్శనమే ఈ ఘటన. వివరాల్లోకి వెళితే.. రాజంపేటకు చెందిన పెరుగు రామలక్ష్మి, కటారి జ్యోతి, తిరణం సాయి కుమారి, కవల లక్ష్మి, పెరుగు శేషమ్మ, మైలపల్లి పోలమ్మ, దండపాక వెంకటలక్ష్మి తదితరులు గురువారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఫోన్ చేశారు. వెదుళ్లపల్లి పంచాయతీ రాజంపేటలో ఏటిగట్టును ఆనుకుని శ్మశాన వాటికకు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని, నడవటానికి ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే రాజా వెంటనే స్పందించారు. సొంత సొమ్ము రూ.లక్షతో శుక్రవారం ఆ రోడ్డులో గ్రావెల్ వేయించి, జేసీబీతో చదును చేయించారు. దీనితో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. జై జక్కంపూడి అంటూ నినాదాలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఒక్కరోజులోనే రోడ్డును ఏర్పాటు చేస్తారని అనుకోలేదని, ప్రజాసేవకు అంకితమైన ఇటువంటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మళ్లీ అధికారంలోకి వస్తారన్నారు. కార్యక్రమంలో పెరుగు వీరభద్రం, పెరుగు రత్నాజీ, హరిబోలు విష్ణు, మైలపల్లి లచ్చయ్య, పెరుగు శ్రీను, కటారి సత్తియ్య, తిరణం బద్రయ్య, కవల వెంకటేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బలభద్రపురంలో గడప గడపకూ..



బలభద్రపురంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రెండో రోజు శుక్రవారం బలభద్రపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకపక్క అభివృద్ధికి, మరో పక్క సంక్షేమ పథకాలకు అనేక నిధులు కేటాయిస్తున్నారన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకే జమ చేస్తున్నారని చెప్పారు. జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఈ సంక్షేమం కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, సర్పంచ్ బుంగా రామారావు, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ మేడపాటి ఆనందరెడ్డి, చిన్నం వీరాఘవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



రాపాక స్కూల్‌ను సందర్శించిన ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: రాపాకలోని ఎంపీపీ పాఠశాల, రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న శుక్రవారం సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వండాలని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మికి కొందరు మధ్యాహ్న భోజనం సరిగ్గా అందించడం లేదని ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో రెండు స్కూళ్లను సందర్శించామన్నారు. ఇక్కడ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేస్తున్నారన్నారు. ఆమె వెంట గుర్రాల కృష్ణారావు, ఈతకోట పోశయ్య, దేశాబత్తుల సుబ్రహ్మణ్యం, తురక రాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



మెళ్లూరులో క్రీడాకారులను అభినందించిన హెచ్ఎం లక్ష్మి

బిక్కవోలు: మెళ్లూరు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను శుక్రవారం పలువురు అభినందించారు. నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు చక్కని ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపిక కావాలని హెచ్ఎం జి.లక్ష్మి ఆకాంక్షించారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ ఎండీ బషీర్‌ను అభినందించారు.

ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

ప్రకాశం నగర్: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ పాఠశాలలో శుక్రవారం పదో బ్యాచ్ ప్రారంభమైంది. 16 మంది లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి హెవీ డ్రైవింగ్ శిక్షణ కోసం, నలుగురు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, డ్రైవింగ్ నైపుణ్యత తెలుసుకునేందుకు ఈ పాఠశాలలో చేరారు. వీరికి శిక్షణ మెటీరియల్‌ను ఎంవీఐ సంపత్ కుమార్, రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్‌కే షబ్నం అందజేశారు. వారికి డ్రైవింగ్ ప్రాథమిక సూత్రాలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు.

ముగిసిన పీఎఫ్ ఉద్యోగుల టోర్నమెంట్



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ మనోజ్‌కుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సౌత్‌జోన్ వాలీబాల్, బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు శుక్రవారం కవలగొయ్యిలోని ఫ్యూచర్‌కిడ్స్ స్కూల్ ప్రాంగణంలో జరిగాయి. విజేతలకు పీఎఫ్ రాజమహేంద్రవరం ప్రాంతీయ కమిషనర్ మనోజ్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడ్డాయి. బాస్కెట్‌బాల్‌లో కేరళ విన్నర్‌గా, తమిళనాడు రన్నర్‌గా, వాలీబాల్ పోటీలో కర్ణాటక విన్నర్‌గా, తమిళనాడు రన్నర్‌గా నిలిచాయి.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని అన్నారు. అనపర్తి పరిధిలోనే 3,600 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. నవరత్న పథకాల అమలు ద్వారా రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీకి అన్ని సందర్భాల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, సర్పంచ్ వారా కుమారి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోండి

- విద్యార్థులకు 'నన్నయ' వీసీ సూచన
- ముగిసిన 'అద్విక 23' టెక్నికల్ ఫెస్టివల్



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

రాజానగరం: సాంకేతికంగా వస్తున్న మార్పులు, చేర్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుంటూ, ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతర సాధన చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు విద్యార్థులకు సూచించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యాన 'అద్విక 23' పేరిట కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన టెక్నికల్ ఫెస్టివల్ శుక్రవారం ముగిసింది. ఇందులో వర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్లు, టెక్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ప్రజెంటేషన్ ఆఫ్ ఐడియా విత్ వర్కింగ్ హైపోథిసిస్ డిబేట్ వంటి సాంకేతిక పోటీల్లో ప్రతిభ చూపే ప్రయత్నం చేశారు. తొలుత భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఆచార్య పద్మరాజుతో పాటు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆచార్యులు కేవీ రావు, ఎస్‌వీఎల్ నరసింహం, పి.రామకృష్ణ పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఇంజినీరింగ్‌లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్ చూపిన ప్రతిభ, చొరవను నేటి తరం వారు కూడా ఆదర్శంగా తీసుకోవాలంటూ వారికి సంబంధించిన కొన్ని సంఘటనలను ఉదహరించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ బి.లక్ష్మి, అడ్వైజరీ కమిటీ సభ్యులు పి.సురేష్‌వర్మ, వి.పెర్సిస్, ఎం.కమలకుమారి, బి.కెజియారాణి, డి.లత, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ



పెదపూడిలో అర్జీ స్వీకరించి ఎంపీపీ, జెడ్పీటీసీలతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

పెదపూడి: జగనన్నకు చెబుదాంలో భాగంగా నిర్వహిస్తున్న 'స్పందన' కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా స్థాయి స్పందన జరిగింది. జేసీ ఇలక్కియతో పాటు డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, డీపీఓ ఆర్.విక్టర్‌బాబు తదితరులు హాజరయ్యారు. రీ సర్వేలో భూమి తక్కువగా ఉందని, కులం పేరుతో దూషించారని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని తదితర అర్జీలను పలువురు అందించారు. కుమారప్రియంలో రోడ్డు పక్కన మట్టిని అక్రమంగా తరలించారని ఫిర్యాదు ఇచ్చారు. మండలంలో ప్రజలకు ఇళ్ల నిర్మాణ రుణాలు మంజూరు చేయాలని, చింతపల్లి, సంపర, కాండ్రేగుల, శహపురం, వేండ్ర గ్రామాల్లో పొలాలకు సంబంధించిన మురుగు కాలువలు ఆధునికరించాలని ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మిలు జేసీకి వినతి ఇచ్చారు. జి.మామిడాడ, మరికొన్ని గ్రామాలను ప్రత్యేక మండలంగా విభజించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం అర్జీ ఇచ్చింది. పెదపూడి మండలాన్ని విభజించవద్దంటూ మండల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మరో అర్జీ అందించారు. ఈ స్పందనలో మొత్తం 36 అర్జీలు అందాయి. జేసీ ఇలక్కియ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన నిర్వహిస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు కాకినాడ రావాల్సిన అవసరం లేకుండా నియోజకవర్గ పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయకుమార్, తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే ఆయా కుటుంబాలు కూడా బాగుంటాయనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కువగా సంక్షేమ పథకాలను మహిళలకే అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తతుంగపాడు, పాత తుంగపాడులలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల కోసం ప్రభుత్వం పరంగా ఇస్తున్న ప్రాధాన్యతను, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసిన విధానాన్ని వివరించారు. ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడమే కాకుండా ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలంటూ, అందుకు అవసరమైన సాయాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, అధికారం కోసం నమ్మించి మోసం చేసే చంద్రబాబుకు ఉన్న తేడాలను గమనించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం హేమనాగలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



దోసకాయలపల్లిలో లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థిని



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రముఖులు

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి క్రీడా మైదానంలో శుక్రవారం అథ్లెటిక్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి టోర్నమెంట్, సెలెక్షన్స్‌లో భాగంగా అండర్ 17, 14 విభాగంలో పరుగు పందెం, లాంగ్‌జంప్ తదితర పోటీలు నిర్వహించారు. 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందెంలో దోసకాయలపల్లికి చెందిన బాలురు, బాలికలు సత్తా చాటారు. లాంగ్‌జంప్‌లో గుమ్ములూరు, దోసకాయలపల్లి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు.

సీతానగరంలో..

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మండల స్థాయి క్రీడాపోటీలను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని ఏడు హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంఈవో స్వామి నాయక్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఆర్బీకే మండల చైర్మన్ వలవల వెంకట్రాజు తదితరులు ఈ పోటీలను ప్రారంభించారు. సింహాద్రి ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్14, 17 బాలుర, బాలికల వాలీబాల్, కబడ్డీ, కోకో, త్రోబాల్, టెన్నికాయిట్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు జరిపారు.

గణపతి మట్టి విగ్రహాల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో శుక్రవారం వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాం సుందర్, ప్రిన్సిపల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మట్టి విగ్రహాలను అందించినట్లు తెలిపారు.

ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం



కొంకుదురులో విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాలలో ఇంజినీర్స్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఇన్‌చార్జి హెచ్ఎం కొప్పిశెట్టి శ్రీకృష్ణసాయి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన విశ్వేశ్వరయ్య కృషి, పట్టుదలతో దేశం గర్వించదగ్గ ఇంజినీర్‌గా ఎదిగారన్నారు. పాఠశాల 8వ తరగతి విద్యార్థులు డి.కార్తికేయ, టి.సత్యప్రశాంత్ రూపొందించిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయులు పడాల ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మణరెడ్డి, అప్పారావు, వలీషా తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి కూరగాయల అందజేత



వాడపల్లికి వ్యాన్‌లో పంపిస్తున్న కూరగాయలు

సీతానగరం: వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగే అన్నదాన కార్యక్రమానికి చినకొండేపూడికి చెందిన వాకపల్లి సూరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం టన్నున్నర కూరగాయలను వ్యాన్‌పై పంపించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ కొన్నేళ్లు తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వెంకమాంబ అన్నదాన సత్రంకు టీటీడీ లారీలపై కూరగాయలు, బియ్యం, గుమ్మడి కాయలను పంపించామన్నారు. మూడేళ్ల క్రితం అంతర్వేది గోశాలకు నాలుగు లారీలపై వట్టిగడ్డిని పంపించామన్నారు. వాడపల్లి వెంకన్న ఆలయం వద్ద జరిగే అన్నదాన కార్యక్రమానికి పదేళ్లుగా కూరగాయలను ప్రజల సహకారంతో అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పల్లేటి సత్యనారాయణ, పల్లేటి ప్రకాశం, పల్లేటి సూరిబాబు, లక్కిశెట్టి సతీష్, ఆకుల త్రిమూర్తులు, మేడిశెట్టి నాగేశ్వరరావు, జనుల రాము, చిట్టి చంటి పాల్గొన్నారు.

నేడు బలభద్రపురంలో గడప గడపకూ..

బిక్కవోలు: బలభద్రపురంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇందులో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తారని తెలిపారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ దాసరి రంగా, ఎంపీపీ సుంకర శ్రీవల్లి సూచించారు. గోకవరంలోని గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సీడీపీఓ వి.లక్ష్మి, సెక్టర్ సూపర్‌వైజర్ పి.ఇందిరారాణి ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, వీరబాబు, తోలేటి ప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, బత్తుల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్‌కు గుర్తింపుపై హర్షం

గోకవరం: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం ఆనందంగా ఉందని గోకవరం ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో చైర్మన్ కొమరపూరి శ్రీనివాసరావు అన్నారు. ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడంతో స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ డిపోలో శుక్రవారం యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు వీవీవీ శ్రీనివాస్, మురళీ సత్యనారాయణ, ఎస్‌వీఎస్ నారాయణ, ప్రసాద్, టీవీడీఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

బిక్కవోలు: మెళ్లూరు గ్రామంలోని శ్రీచవ్వాల పెదభూలోకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జి.లక్ష్మి మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు హిందీ పాటలు పాడి అలరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. ఉపాధ్యాయురాలు ఎస్.కామాక్షి తదితరులు పాల్గొన్నారు.